వర్జీనియాకు అంతర్జాతీయ డిమాండ్



దేవరపల్లి మండలం చిన్నాయగూడెంలో పొగాకు తోటను పరిశీలిస్తున్న బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్, అధికారులు

- బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్
- రెండు మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటన
- పొగాకు తోటల పరిశీలన
- రైతులతో సమావేశం

దేవరపల్లి: అంతర్జాతీయ మార్కెట్లో వర్జీనియా పొగాకుకు మంచి డిమాండ్ ఉందని, దాంతో ఈ ఏడాది కూడా మార్కెట్ ఆశాజనకంగా ఉండవచ్చని భావిస్తున్నామని పొగాకు బోర్డు చైర్మన్ జి.యశ్వంత్ కుమార్ అన్నారు. మండలంలోని కృష్ణంపాలెం, సంగాయగూడెం, చిన్నాయగూడెం గ్రామాల్లోని పొగాకు తోటలను మంగళవారం ఆయన పరిశీలించారు. గోపాలపురం వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు పిన్నమనేని మధు చిన్నాయగూడెంలోని పొగాకు బ్యారన్ల వద్ద ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో చైర్మన్ యశ్వంత్‌కుమార్ మాట్లాడారు. మిచాంగ్ తుపాను అనంతరం రైతులు చేపట్టిన సస్యరక్షణ చర్యల వల్ల తోటలు నిలదొక్కుకున్నాయన్నారు. దీక్ష, పట్టుదలతో తోటలను యథావిధిగా నిలబెట్టిన రైతులను ఆయన అభినందించారు. పొగాకు తోటల పరిశీలన, పంట ఎలా ఉందో తెలుసుకోవడానికే తాను వేలం కేంద్రాల వారీగా పర్యటిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది పొగాకు సాగు విస్తీర్ణం దాదాపు నాలుగు వేల హెక్టార్లు పెరిగిందన్నారు. అయితే ఎకరా విస్తీర్ణంలో వచ్చే దిగుబడి తగ్గే అవకాశం రైతులు చెబుతున్నారని యశ్వంత్‌కుమార్ తెలిపారు. దిగుబడులు తగ్గుతుండడం, పెట్టుబడి పెరిగినందున మార్కెట్లో రేటు ఆశాజనకంగా ఉండాలని రైతులు కోరుతున్నారని చెప్పారు. రైతుల సంక్షేమానికి పొగాకు బోర్డు ఎప్పుడూ సంసిద్ధంగా ఉంటుందన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారతదేశంలో పండిస్తున్న పొగాకు గొప్పదనం గురించి అధికారులు, ఎగుమతి సంస్థలకు చెబుతుంటామన్నారు.

అంతర్జాతీయ మార్కెట్ ప్రయత్నం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఉత్తర తేలిక నేలల్లో (ఎన్ఎల్ఎస్) పండిస్తున్న పొగాకును అంతర్జాతీయ మార్కెటింగ్ చేయడానికి పొగాకు బోర్డు ప్రయత్నిస్తోందని చైర్మన్ యశ్వంత్‌కుమార్ చెప్పారు. బోర్డు అధికారులు అవగాహన కల్పించినప్పటికీ బతుకు తెరువు కోసం రైతులు అక్కడక్కడా అనధికారికంగా పొగాకు పంట వేస్తున్నారని అన్నారు. పంట నియంత్రణ బోర్డు పరిధిలో లేదని చెప్పారు. అయితే నియంత్రణ కోసం బోర్డు ప్రయత్నం చేస్తోందని తెలిపారు. గతేడాది ఎన్ఎల్ఎస్‌లో 55 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తి కాగా, ఈ ఏడాది 60 మిలియన్ల కిలోలు ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నట్టు వివరించారు. పొగాకు క్యూరింగ్‌లు ముమ్మరంగా జరుగుతున్నాయని, నాణ్యత, రంగులు బాగున్నాయని చెప్పారు. మార్చి నెలలో పొగాకు కొనుగోళ్లు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. రైతు సంఘాల ప్రతినిధులు, ట్రేడర్లతో సమావేశం ఏర్పాటు చేసి తేదీని ఖరారు చేస్తామని తెలిపారు. కర్నాటకలో పొగాకు కొనుగోళ్లు మరో 15 రోజుల్లో ముగుస్తాయని, అనంతరం ఆంధ్రాలో కొనుగోళ్లు ప్రారంభిస్తామని చెప్పారు. కొనుగోలు దారులంతా వేలంలో పాల్గొనేలా చర్యలు తీసుకుంటామన్నారు. కర్నాటకలో 96 రోజుల పాటు వేలం నిర్వహించగా, 72 మిలియన్ల కిలోల పొగాకు కొనుగోలు చేసినట్టు వివరించారు. కిలోకు గరిష్ఠ ధర రూ.290, సగటు ధర రూ. 251 రైతులకు లభించినట్టు చెప్పారు. సమావేశంలో రీజినల్ మేనేజరు ఎం. ఆదిశేషయ్య, దేవరపల్లి, గోపాలపురం వేలం కేంద్రాల అధికారులు జీఎల్‌కే ప్రసాద్, అమల్ డి. శ్యామ్, రైతులు, ఎస్‌జీటలు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయాలి



వాదాలకుంటలో క్యూరింగ్ పొగాకును పరిశీలిస్తున్న యశ్వంత్‌కుమార్, బోర్డు సిబ్బంది

గోపాలపురం: వర్జీనియా పొగాకు ఉత్పత్తిలో రైతులు నాణ్యతా, ప్రమాణాలు పాటించాలని పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని కోమటికుంట, వాదాలకుంట గ్రామాల్లో పర్యటించి పొగాకు తోటలను, క్యూరింగ్ పొగాకును పరిశీలించారు. తుపాను ప్రభావం వల్ల పొగాకు సాగుకు అధిక పెట్టుబడి అయ్యిందని ఈ సందర్భంగా పలువురు రైతులు చైర్మన్‌కు వివరించారు. ఈయన వెంట పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజినల్ మేనేజర్ ఎం. ఆదిశేషయ్య, ఏఎస్ అమూల్, డి. శ్యామ్, ఎస్‌జీఓ టి. హేమస్మిత, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాంచ్ పోస్టాఫీసులో డిపాజిట్ల గోల్‌మాల్!

- పాత జీపీఎం స్థానంలో కొత్తవారికి బాధ్యతలు
- తెలికిచెర్లలో ఖాతాదారుల పాస్ పుస్తకాల తనిఖీ



తెలికిచెర్ల బ్రాంచి పోస్టాఫీసులో ఖాతాదారుల పాస్ బుక్‌లు తనిఖీ చేస్తున్న మేల్ వాచర్ సత్యనారాయణ

నల్లజర్ల: గతేడాది మండలంలోని చీపురుగూడెం బ్రాంచి పోస్టాఫీసులో ఖాతాదారుల డిపాజిట్ల సొమ్ము దాదాపు రూ.15 లక్షలు గోల్‌మాల్ అయిన వ్యవహారం ఇప్పటికీ ఓ కొలిక్కి రాలేదు. ఇంతలోనే మండలంలోని తెలికిచెర్ల బ్రాంచి పోస్టాఫీసులో డిపాజిట్‌దారుల సొమ్ము పక్కదారి పట్టిందని సమాచారం. దీనిపై అనుమానం వచ్చిన పోస్టల్ శాఖ అధికారులకు వారం రోజులుగా తెలికిచెర్ల బ్రాంచ్‌లో వివిధ రకాల తనిఖీలు చేపట్టారు. అక్కడ పనిచేస్తున్న బీపీఎం కన్యాకుమారిని విధుల నుంచి తప్పించినట్టు చెబుతున్నారు. కార్యాలయాన్ని కూడా ఆమె ఇంటి నుంచి మరో చోటుకు మార్చారు. తూర్పు చోడవరం బ్రాంచి పోస్టు మాస్టర్ గోపి ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. మంగళవారం నిడదవోలు నుంచి మేల్ వాచర్ సత్యనారాయణ, మరో సహాయకుడు కలసి ఖాతాదారుల పాస్ పుస్తకాలను తనిఖీ చేస్తున్నారు. ఇదేమిటని విలేకరులు ప్రశ్నించగా ఐదేళ్లకోసారి పూర్తిస్థాయి తనిఖీ ఉంటుందని , ఇది అందులో భాగమేనని సత్యనారాయణ వివరించారు. తమ కార్యాలయంలోని డిపాజిట్ల వివరాలను ఖాతాదారుల పాస్‌బుక్‌లలో ఉన్న డిపాజిట్ వివరాలతో సరి చూస్తున్నామన్నారు. వ్యత్యాసాలు ఉంటే తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఇంతవరకూ పనిచేసిన బీపీఎం కన్యాకుమారి సెలవులో ఉన్నారన్నారు. పాస్ బుక్‌లు తనిఖీ చేస్తున్నారని టాం టాం వేయడంతో మహిళలంతా తమ డిపాజిట్ సొమ్ములు ఏమయ్యాయంటు పోస్టాఫీసుకు పరుగులు పెడుతున్నారు.

డీఎస్పీగా రామారావు బాధ్యతల స్వీకరణ



కే సీహెచ్ రామారావు, కొవ్వూరు డీఎస్పీ



వనజాక్షి, గోపాలపురం తహసీల్దార్



రమేష్‌బాబు, ఎంపీడీఓ

కొవ్వూరు: కొవ్వూరు సబ్ డివిజనల్ పోలీసు అధికారి (డీఎస్పీ)గా కేశన చెంచు రామారావు మంగళవారం సాయంత్రం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కక డీఎస్పీగా ఇక్కడ పనిచేసిన వీఎస్ఎన్ వర్మ నరసరావుపేటకు బదిలీ అయ్యారు. గుంటూరు దిశ ఉమెన్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న రామారావును కొవ్వూరుకు బదిలీ చేశారు.

తహసీల్దార్, ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

గోపాలపురం: తహసీల్దార్‌గా డి.వనజాక్షి, ఎంపీడీఓగా కె.రమేష్‌బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్ వనజాక్షి కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం నుంచి ఇక్కడికు బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన బి. రవీంద్రనాథ్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె. గంగవరం మండలానికి బదిలీ అయ్యారు. ఎంపీడీఓ కె. రమేష్‌బాబు తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం నుంచి ఇక్కడికు బదిలీపై వచ్చారు.

కొవ్వూరు తహసీల్దార్‌గా మస్తాన్

కొవ్వూరు: స్థానిక తహసీల్దార్‌గా కె.మస్తాన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన బి.నాగరాజు నాయక్ అనపర్తి బదిలీ అయ్యారు. ఉయ్యూరు నుంచి బదిలీపై మస్తాన్ కొవ్వూరు వచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా విధుల్లో చేరిన మస్తాన్‌కు వీఆర్వోలు,కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి ఆహ్వానం పలికారు.



కొవ్వూరు తహసీల్దార్ మస్తాన్‌కు స్వాగతం పలుకుతున్న వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది

కొవ్వూరు చేరిన భోగి గణపతి పీఠం రథయాత్ర



కొవ్వూరు చేరుకున్న భోగి గణపతి పీఠం నుంచి రథంతో పాదయాత్ర

కొవ్వూరు: కాకినాడలోని భోగి గణపతి పీఠం నుంచి రథంతో పాదయాత్రగా బయల్దేరిన 400 మంది హనుమాన్ భక్తబృందం మంగళవారం కొవ్వూరు చేరుకుంది. ఉంగరాల వీర వెంకట సుబ్బారావు గురుస్వామి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం బయల్దేరిన ఈ యాత్ర ఈనెల 13న భద్రాచలం చేరుకోనున్నట్టు ఆయన తెలిపారు. గత 13 ఏళ్లుగా ఈ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు.13న యాత్ర ముగిసిన తర్వాత కాకినాడ సమీపంలోని గొంచాల, అచ్చంపేటలోని పాదయాత్ర రామాలయం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సౌజన్యంతో అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు. సమితి గౌరవాధ్యక్షుడు వింటి బాబ్జీ, అధ్యక్షుడు పేర్నీడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సంతలో తూనికలు, కొలతల శాఖ తనిఖీలు



దేవరపల్లి సంతలో కూరగాయల దుకాణంలో కాటా తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

దేవరపల్లి: స్థానికంగా మంగళవారం నిర్వహించిన వారపు సంతలో తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. కూరగాయల దుకాణాల్లోని ఎలక్ట్రానిక్ కాటాలను కొవ్వూరు డివిజన్ తూనికల, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్, సిబ్బంది తనిఖీ చేశారు. కాటాలు సక్రమంగానే ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రతి దుకాణంలోనూ విధిగా సీలు వేసిన ఎలక్ట్రానిక్ కాటాలను వాడాలని వ్యాపారులను ఆయన ఆదేశించారు. తూకాల్లో తేడాలు వస్తున్నట్టు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చేపల మార్కెట్, చికెన్ దుకాణాల్లో అక్కడక్కడా దండి కాటాలు వాడుతున్నట్టు సమాచారం వచ్చిందని, అలాంటి వారిపై చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. అలాగే దేవరపల్లిలోని వివిధ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి రెండు కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. అనంతరం రామన్నపాలెం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో అసిస్టెంట్ నియంత్రణ అధికారి బీఎస్‌వీ సాయిరాం పాల్గొని విద్యార్థులకు తూకాలు, ప్యాకింగ్ సరకులపై అవగాహన కల్పించారు. ప్యాకెట్‌పై ఉత్పత్తి కంపెనీ పేరు, పరిమాణం, తయారీ తేదీ, ఎమ్మార్పీ ముద్రణ ఉండాలని తెలిపారు. ఈ సదస్సులో ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్, హెచ్ఎం ప్రేమకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు గ్రామాల్లోనే మెరుగైన వైద్యం

- డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో సంధ్య
- అన్నదేవరపేట, కొవ్వూరుపాడుల్లో జగనన్న సురక్ష వైద్య శిబిరాలు



అన్నదేవరపేటలో రోగులకు మెడికల్ కిట్లు అందజేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సంధ్య

తాళ్లపూడి: పేదలకు గ్రామాల్లోనే నిపుణులైన వైద్యులతో పరీక్షలు చేయిస్తున్నామని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో జె.సంధ్య అన్నారు. మండలంలోని అన్నదేవరపేటలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు స్వర్ణలత, నవ్య, ఆర్థోపెడీషియన్ మానీస్, పీడియాట్రీషియన్ వర్మ, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఆనంద్ తదితరులు సుమారు 300 మంది రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో సంధ్య చేతుల మీదుగా అవసరమైన రోగులకు మెడికల్ కిట్లు అందజేశారు. పలు రకాల పరీక్షలను నిర్వహించారు. శిబిరంలో ఆరోగ్య సిబ్బంది సేవలు అందించారు.

కొవ్వూరుపాడులో 180మందికి..

గోపాలపురం: మండలంలో కొవ్వూరుపాడులో మంగళవారం జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ చిలకా లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు 180 మంది రోగులకు వైద్యులు వివిధ రకాలు పరీక్షలు నిర్వహించారు. హుకుంపేట పీహెచ్‌సీ డాక్టర్ కె. శ్రీనివాస్ సారథ్యంలో పలువురు వైద్యులు సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారిలో గుండె, ఎముకల వ్యాధులతో బాధపడుతున్న 12 మంది రోగులను మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ఉన్నతాసుపత్రులకు సిఫార్సు చేసినట్టు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుర్గారావుకు సత్కారం



దుర్గారావును సత్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

తాళ్లపూడి: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా రెండో సారి ఎన్నికైన మండలానికి చెందిన డి.దుర్గారావును పైడిమెట్ట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఏపీ టీఎఫ్ తాళ్లపూడి మండల శాఖ దుర్గారావును దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించింది. అనంతరం ఆ సంస్థ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రఘువీరశాస్త్రి , శంకరం మాట్లాడుతూ దుర్గారావు పోరాట పటిమే ఆయనను జిల్లా అధ్యక్ష స్థానం వరకూ తీసుకెళ్లిందన్నారు. జిల్లా అధ్యక్షుడు దుర్గారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ఏపీ టీఎఫ్ తరఫున రాజీ లేని పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు నాని, పద్మశ్రీ మణి, కనకదుర్గ, రాజారత్నం, మూర్తి, కృష్ణమోహన్, జీవీకే రాజు, సుభాషిణి, కందుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సనపల రాజశేఖర్, ఉపాధ్యాయులు శేషాబాయి, గంగాదేవి, జేడీ సునీత, వైఎస్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



ఉండ్రాజవరం విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం

ఉండ్రాజవరం: రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా గణాంక శాఖాధికారి జి.భాస్కర్ అన్నారు. ఉండ్రాజవరం పీహెచ్‌సీ పరిధిలోని స్థానిక విలేజ్ హెల్త్ క్లినిక్-1ను మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ కమిటీ తనిఖీ చేసింది. జిల్లా పారా మెడికల్ ఆఫీసర్ (డీపీఎంవో) డాక్టర్ సంధ్యారెడ్డి ఆధ్వర్యంలో జి.భాస్కర్‌తో పాటు వసంతలక్ష్మి, డేటా మేనేజర్ రామకృష్ణ, అర్జున్‌లతో కూడిన బృందం ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ముందుగా గర్భిణుల ఎంసీపీ కార్డ్స్, పిల్లల టీకాల నమోదు రిజిస్టర్‌లను వారు పరిశీలించారు. 19 ఏళ్ల వయస్సు వారికి హెచ్‌బీ పరీక్షలు నిర్వహించి, పాత రికార్డులతో పోల్చి చూశారు. కార్యక్రమంలో ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఉషారాణి, సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, పబ్లిక్ హెల్త్ నర్స్ కుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు జి.శ్రీనివాస్, నాగమణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో భద్రత పరిశీలన

పెరవలి: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ స్టేషన్ల వద్ద భద్రతా స్థితిగతులు ఎలా ఉన్నాయో పరిశీలిస్తున్నామని నిడదవోలు సీఐ వేంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని 18 గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ వేంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 56 పోలింగ్ స్టేషన్లు ఏర్పాట్లు చేశారన్నారు. వాటి వద్ద భద్రత ఎలా ఉంది? పోలింగ్‌కు అవాంతరాలు కలగకుండా పాటించాల్సిన అంశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఏజీఎస్ మూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జాబితాలో మృతులుంటే బాధ్యత బీఎల్‌ఓలదే

పెరవలి: ఓటర్ల జాబితాలోఉన్న వారిలో ఎవరైనా మృతులు ఉంటే అందుకు సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓ)లు బాధ్యత వహించాలని ఎంపీడీవో కె.హిమమహేశ్వరి, తహసీల్దార్ దాసరి సుధ అన్నారు. మండలంలోని బీఎల్‌ఓలతో మంగళవారం వారిద్దరూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అధికారులిద్దరూ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఉన్న వ్యక్తుల్లో ఎవరైనా మృతి చెందితే జాబితా నుంచి వారి ఓట్లను తొలగించాలన్నారు. ఎన్నికల సమయంలో పార్టీల ప్రమేయం లేకుండా అందరూ ఎన్నికల నియమావళి ప్రకారం నడుచుకోవాలని సూచించారు. బీఎల్‌ఓలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మకు అష్టాదశ వార్షికోత్సవం



పూజలకు శ్రీకారం చుడుతున్న భోగవల్లి శ్రీరామారావు, రాజ్యలక్ష్మి దంపతులు

నల్లజర్ల: మండలంలోని చోడవరం గ్రామదేవత అయిన ముత్యాలమ్మ వారి అష్టాదశ వార్షికోత్సవాలు మంగళవారం ప్రారంభం అయ్యాయి. మూడు రోజుల పాటు గ్రామంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు గ్రామపెద్ద భోగవల్లి శ్రీరామారావు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన స్వర్ణ రుద్రాక్ష కంకణ సన్మానిత, వాస్తు విద్వాన్ యనమండ్ర సత్యసీతారామశర్మ (రాంబాబు) ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నారు. భాజీ భజంత్రీలు, గరగ నృత్యాలు, బాణసంచా కాల్పులతో మంగళవారం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం భోగవల్లి శ్రీరామారావు, రాజ్యలక్ష్మి దంపతులచే అమ్మవారి కలశ స్థాపన, అంకురార్పణ, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ, హోమం నిర్వహించారు. అమ్మవారికి బుధవారం కుంకుమార్చన, సాయంత్రం శాంతి కలశారాధన, గీతా పారాయణం కార్యక్రమాలు జరుగుతాయి. గురువారం గ్రామ పెద్ద గన్నమని సుబ్బారావు దంపతులచే లక్ష చామంతులతో పుష్పార్చన, అన్న సమారాధన నిర్వహిస్తారు.

9న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఉండ్రాజవరం: కడుపులోని నులి పురుగుల నివారణకు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఈనెల 9న ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఉషాదేవి తెలిపారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పిల్లల కడుపులో నులి పురుగులు ఉండడం వలన వారిలో రక్తహీనత వస్తుందన్నారు. స్కూల్ పిల్లలందరూ భోజనానికి ముందు చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, ఆరోగ్య పర్యవేక్షకులు జి.శ్రీనివాస్, నాగమణి, ఆశా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

13న కొవ్వూరులో వాహనాల వేలం

కొవ్వూరు: సారా, ఇతర కేసుల్లో పట్టుబడిన టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్, చెక్క పడవను ఈనెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక ఎస్ఈబీ కార్యాలయం వద్ద వేలం వేస్తామని స్థానిక ఎస్ఈబీ సీఐ జి. శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.5 వేల ధరావత్తు చెల్లించాలన్నారు. వాటిని పాడుకున్న వారు పాట మొత్తం సొమ్ముతో పాటు 18 శాతం జీఎస్టీ కలిపి చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాల కోసం 94409 02430 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

హైస్కూల్‌కు సౌండ్ సిస్టం బహూకరణ



తాడిమళ్ల జెడ్పీ హైస్కూల్‌కు సౌండ్ సిస్టం అందిస్తున్న పూర్వ విద్యార్థి పోతురాజు, స్థానిక నాయకులు

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి పసుపులేటి పోతురాజు రూ.30 వేల ఖరీదైన సౌండ్ సిస్టమ్‌ను మంగళవారం అందజేశారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేస్తున్న కృషి అభినందనీయమని హెచ్ఎం సూర్యనారాయణ శాస్త్రి అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పెనుగొండ సుబ్బారాయుడు, పొన్నా వ్యాసమూర్తి, కాపకాయల సూర్యనారాయణ, పెనుగొండ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయుర్వేద ఆసుపత్రికి ఫర్నిచర్ అందజేత



ఆసుపత్రికి ఫర్నిచర్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, క్లబ్ సభ్యులు

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు ఆధ్వర్యంలో కొత్తపల్లి నాగేశ్వరరావు, నాగమణి దంపతులు రూ.2 లక్షలతో కొనుగోలు చేసిన ఫర్నిచర్‌ను పట్టణంలోని ఆయుర్వేద ఆసుపత్రికి మంగళవారం విరాళంగా అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ రోటరీ క్లబ్ సభ్యులు ఇస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్, రోటరీ సభ్యులు బి.పాపారావు, గొన్నాబత్తుల రామారావు, ఎం.చిట్టిబాబు, అడబా సూర్యచంద్రరావు, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

నిడదవోలు: పట్టణంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలని కమిషనర్ కె.శ్రీనివాస్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రైన్లు, మంచినీటి సరఫరా పైపులైన్లు, పారిశుధ్య పనులను మంగళవారం ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ హేమంత్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయ వాస్తును పరిశీలించిన స్తపతి



వేంకటేశ్వరస్వామి గుడి వాస్తును పరిశీలిస్తున్న డిప్యూటీ స్తపతి శ్రీనివాసాచార్యులు, అధికారులు

పెరవలి: అన్నవరప్పాడు గ్రామంలోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని మంగళవారం దేవదాయ, ధర్మాదాయశాఖ డిప్యూటీ స్తపతి శ్రీనివాసాచార్యులు పరిశీలించారు. ఈ ఆలయంలోని వాస్తు దోషాల పరిశీలనకు, భవిష్యత్తులో చేపట్టే నిర్మాణాలకు వాస్తు పరిశీలనకు తానిక్కడకు వచ్చానని ఆయన తెలిపారు. భక్తుల సౌకర్యార్థం పలు అదనపు నిర్మాణాలు, వ్యాపారాల నిమిత్తం షెడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు వాస్తును పరిశీలించడానికి వచ్చానని వివరించారు. ఈ ఆలయ ప్రాంగణంలో కొత్తగా కొన్ని నిర్మాణాల ఏర్పాటుకు, పాత వాటి తొలగింపునకు వాస్తును పరిశీలిస్తున్నానన్నారు. దీనిపై తుది నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయం ఈఓ మీసాల రాధాకృష్ణ, ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన

చాగల్లు: కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాల్లో భాగంగా బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం ఈ వ్యాధిపై వైద్యాధికారులు కె.నిశిత, పీఆర్‌ఎల్ దేవి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. స్పర్శ కార్యక్రమలో భాగంగా అనుమానిత కేసులు గుర్తించి దాని ద్వారా వ్యాధి నిర్ధారణ చేసి మందులు పంపిణీ చేశారు. కుష్ఠు వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని డాక్టర్ కె.నిశిత, డాక్టర్ పీఆర్‌ఎల్ దేవి అన్నారు. అనుమానితులు స్థానిక పీహెచ్‌సీకి గాని, గ్రామ స్థాయిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు గాని వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రారంభ దశలోనే కుష్ఠు వ్యాధిని గుర్తించి, క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధిని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఆఫీస్ పీఎంఓకే వీరలక్ష్మి, జె.వీర్రాజు , ఎ. రామచంద్రరావు, వి.పద్మ తదితరులు పాల్గొన్నారు.